క్లుప్తంగా

గురుకుల పాఠశాల తనిఖీ



తిమ్మాపురం గురుకుల పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న డీసీఓ మురళీకృష్ణ

కంబదూరు: మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఉన్న అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలను శుక్రవారం అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల జిల్లా కన్వీనర్ మురళీకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా డీసీఓ పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లతో పాటు భోజనశాలను పరిశీలించి మధ్యాహ్నం అక్కడే విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. పాఠశాలలో సమస్యలను ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు.అనంతరం ఎస్సీ,ఎస్టీ జేఏసీ మండల అధ్యక్షుడు డాబా రమేష్ పాఠశాలలో నెలకొన్న మరుగుదొడ్ల అపరిశుభ్రత, తాగునీటి సమస్య తదితర మౌలిక వసతులపై డీసీఓ దృష్టికి తీసుకెళ్లారు. డీసీఓ వెంట ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మల్బరీ షెడ్డుకు నిప్పు



దగ్ధమైన మల్బరీ షెడ్

శెట్టూరు: మండలంలోని చెర్లోపల్లికి చెందిన రైతు విరుపాక్షి మల్బరీ షెడ్డుకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. శుక్రవారం పొలంలో ఉన్న మల్బరీ షెడ్డులో ఆయన నిద్రిస్తుండగా.. ఆగంతకులు షెడ్డుకు నిప్పు అంటించారు. వేడికి మేల్కొన్న విరుపాక్షి ప్రాణాలతో బయటపడ్డాడు. పెద్ద మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల రైతులు అక్కడకి చేరుకుని మంటలను అదుపుచేశారు. అప్పటికే షెడ్డు మొత్తం కాలిబూడిదైనట్లు బాధితుడు వాపోయాడు. రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక




ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో కమిటీ సభ్యులు

కంబదూరు: మండల ఏపీటీఎఫ్ కార్యవర్గాన్ని శుక్రవారం ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మారెన్న, ప్రధాన కార్యదర్శిగా అక్కులన్న ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారుడు గురుమూర్తి, గౌరవ అధ్యక్షుడు సుధాకర్, ఏపీటీఎఫ్ మాజీ అధ్యక్షుడు ఎర్రిస్వామి, కమిటీ సభ్యులు భువనేంద్ర, రియాజ్, సుధాకర్, ఆదిశేషయ్య, వీరాంజనేయులు, తిప్పేస్వామి, నాగిరెడ్డి, లోకేష్, జోనాథన్, గోహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

యువకునికి గాయాలు

విడపనకల్లు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కర్నూలు జిల్లా మద్దికెర గ్రామానికి చెందిన శ్యాముల్ మండలంలోని కరకముక్కలలో బంధువుల ఇంటికి వచ్చాడు. పని ముగించుకుని ద్విచక్రవాహనంలో మద్దికెరకు బయలుదేరాడు. ఆర్.కొట్టాల గ్రామ సమీపంలో రోడ్డుకు అడ్డంగా వచ్చిన కుక్కను ఢీకొని కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడే ఉన్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బోయ బసన్న 108కు సమాచారం అందించారు. వాహనం ఆలస్యమవుతుందేమోనని మానవత్వంతో తన సొంత కారులో చికిత్స నిమిత్తం ఉరవకొండకు తరలించారు. మార్గం మధ్యలో 108 వాహనం రావడంతో తన కారులో నుంచి 108లోకి శ్యాముల్‌ను తరలించారు. ఉరవకొండ ప్రభుత్వ హాస్పిటల్‌కు వచ్చి శ్యాముల్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలపడంతో బసన్న కొంత నగదును చికిత్స కోసం బాధితుడి బంధువులకు ఇచ్చి తన మానవత్వం చాటుకున్నారు. బసన్నతో పాటు విడపనకల్లు మాజీ జెడ్పీటీసీ సింగాడీ తిప్పయ్య కూడా దగ్గరుండి సహాయ సహకారాలు అందించారు.

కర్ణాటక మద్యం ధ్వంసం



మద్యంను ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

ఉరవకొండ: ఉరవకొండ సెబ్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో సెబ్ అధికారులు సీజ్ చేసిన కర్ణాటక మద్యాన్ని శుక్రవారం సెబ్ అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది ధ్వంసం చేశారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ దాదాపు 17 కేసుల్లో పట్టుబడిన రూ.లక్ష విలువ చేసే 3,072 టెట్రా ప్యాకెట్లను ధ్వంసం చేశామన్నారు. మద్యం, ఇసుక అక్రమ రవాణాపై నిఘా ఉంచామన్నారు. కార్యక్రమంలో సెబ్ సీఐ మారుతిరావు, ఎస్‌ఐ హుసేన్‌బాషా, హెడ్‌కానిస్టేబుళ్లు హేమంత్‌కుమార్, ప్రభాకర్, జాన్, వాసు, కామాక్షి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు

- గడప గడపలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వ



గుమ్మఘట్ట: తాళ్లకెర గ్రామంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



ఉరవకొండ: రాకెట్లలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

గుమ్మఘట్ట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందజేస్తూ ఆదర్శ పాలన చేస్తున్నారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని తాళ్లకెర గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. విప్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. విప్ మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ వ్యవస్థద్వారా ప్రజల ఇంటి ముందుకు సంక్షేమపథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. గ్రామంలో కొంతమంది మహిళలు తాగునీటి సమస్య ఉందని, విద్యుత్ మోటార్ మొరాయించడంతో ఇబ్బందిగా మారిందని తెలియచేయగానే స్పందించిన విప్ యుద్ధప్రాతిపదికన నూతన విద్యుత్ మోటార్ సొంతనిధులతో కొనుగోలు చేసి ప్రజలకు అందించడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

రాబోవు ఎన్నికల్లో టీడీపీ గల్లంతు

రాబోవు ఎన్నికల్లో టీడీపీ గల్లంతు అవ్వడం ఖాయమని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. ఎల్లో మీడియా, టీడీపీ నేత చంద్రబాబు, ముద్దపప్పు లోకేష్, దత్తపుత్రుడు ఎన్ని పొర్లు దండాలు పెట్టినా,ఎన్ని పగటి వేషాలు వేసినా, ఎన్ని హామీలు గుమ్మరించినా టీడీడీ అడ్రస్ లేకుండా పోవడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. ప్రజాదరణ ఉన్న నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాబోవు ఎన్నికల్లో ప్రభంజనం సృష్టిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి, ఈఓపీఆర్డీ సురేశ్‌బాబు, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, ఎంపీపీ భవాని, వైస్ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, బేలోడు సర్పంచ్ ఉమేష్, ఎంపీటీసీలు మహేష్, గోవింద, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, కాంట్రాక్టర్లు కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, ఆర్టీ కాంతారెడ్డి, నాయకులు పల్లక్కిరెడ్డి, బాసాల వీరభద్రరెడ్డి, బాసాల ఈశ్వర్ రెడ్డి, లోకప్ప, నారాయణరెడ్డి, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి,భీమరెడ్డి,గొల్ల నాగరాజు, గిరిరెడ్డి, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో రాకెట్లకు రూ.11 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాలుగేళ్ల కాలంలో సొంత గ్రామం రాకెట్లను అభివృద్ధి పథకంలో పయనించేలా చేశామని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని రాకెట్ల గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సొంత గ్రామంలో పార్టీ నాయకులు, గ్రామస్తులు ఆయనకు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందించారు. ఈసందర్భంగా ప్రజలు సంక్షేమ పథకాలు, ప్రభుత్వ పాలన పట్ల పూర్తి స్థాయిలో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగేళ్ల ప్రభుత్వ పాలనలో రాకెట్ల గ్రామస్తులు రూ.11 కోట్లు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందారన్నారు. దాదాపు రూ.4కోట్లతో రాకెట్ల నుంచి తండాకు రోడ్డు మంజూరు చేశామన్నారు. జేజేఎం ద్వారా రూ.కోటి మంజూరు అయ్యాయన్నారు. దీంతో పాటు పంచాయతీ పరిధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామన్నారు. రాకెట్లలో అన్ని హంగులతో పీహెచ్‌సీ, ఆర్‌బీకే, సచివాలయాలు నిర్మించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దెయ్యాల శివమ్మ, ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ శ్రీనాథ్‌రెడ్డి, పెన్నహోబిలం ఆలయ మాజీ చైర్మన్ అశోక్, నాయకులు నాగరాజు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, రామిరెడ్డి, రాకెట్ల ప్రసాద్ బాబు, రామన్న, ఎంపీపీ చంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ ఏసీపార్వతమ్మ, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ సుశీలమ్మ, పార్టీ నాయకులు తేజోనాథ్, జెడ్పీ మాజీ సభ్యుడు తిప్పయ్య, ఎంపీడీఓ వరలక్ష్మి, సీఐ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

విడపనకల్లు: మండల కేంద్రంలోని సచివాలయం2 పరిధిలో ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు హాజరు కావాలన్నారు.

కణేకల్లు: మండలంలోని నల్లంపల్లి గ్రామంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం విప్ కాపు రామచంద్రారెడ్డి నేతృత్వంలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి శుక్రవారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు , వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

జీఓ 106 రద్దు చేయాలి

కళ్యాణదుర్గం: ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీఓ 106ను వెంటనే రద్దు చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. స్థానిక పెన్షనర్ల భవనంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సంఘం కార్యదర్శి తిప్పేస్వామి మాట్లాడుతూ జీఓ నం.67 ప్రకారం డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని సూచించారు. పెన్షనర్ల జీవితభాగస్వామి మరణిస్తే అంత్యక్రియల నిమిత్తం రూ.22 వేలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు శివప్రసాద్, సభ్యులు మారెన్న, అంజినప్ప, సీసీరెడ్డి, నాగరాజు, పాండురంగ, ఫక్రుద్దీన్, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జీవాల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

బొమ్మనహాళ్ / బెళుగుప్ప: గొర్రెలు, మేకలకు సోకే వివిధ రకాల వ్యాధుల పట్ల కాపరులు అప్రమత్తంగా ఉండాలని మండల పశు వైద్యాధికారి రమేష్ సూచించారు. శుక్రవారం కాలువపల్లి, గంగవరం గ్రామాల్లోని గొర్రెల మందల్లో వున్న ఫలంగా మూడు గొర్రెపిల్లలు మృతి చెందాయి. దీంతో కాపరులు పశు వైద్యాధికారికి సమాచారం ఇచ్చారు. వెంటనేఆయన మరో పశు వైద్యాధికారి నాగబాబుతో కలసి వెళ్లి మృతి చెందిన జీవాలకు పోస్టుమార్టం నిర్వహించారు. కాలువపల్లిలో చిటుక వ్యాధి, గంగవరంలో పీపీఆర్ వ్యాధి(పారుడు రోగం)తో జీవాలు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. వెంటనే ఆయా మందల్లో ఉన్న సుమారు 600 జీవాలకు నివారణ టీకాలు వేశారు.

సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ



గర్భిణులకు కిట్లను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ/కూడేరు/బొమ్మనహాళ్: ఉరవకొండ మండలంలోని రాకెట్ల అంగన్ వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి చేతుల మీదుగా గర్భిణులు, బాలింతలకు అందించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత ఏర్పడకుండా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాబియా, సర్పంచ్ శివమ్మ, ఎంపీపీ చంద్రమ్మ, జెడ్పీటీసీ పార్వతమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, పెన్నహోబిలం ఆలయ మాజీ చైర్మన్ అశోక్, రాకెట్ల ప్రసాద్‌బాబు, నాగరాజు, మాజీ ఎంపీటీసీ శీనా, రామిరెడ్డి పాల్గొన్నారు. అలాగే కూడేరు మండలంలోని పి.నారాయణపురంలో సర్పంచ్ హనుమంతరెడ్డి, కొర్రకోడులో సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు. బొమ్మనహాళ్ మండలంలోని ఉద్దేహాళ్, హరేసముద్రం గ్రామాల్లో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. వైద్యులు శ్రీలక్ష్మి, మల్లీశ్వరి, ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, విజయలక్ష్మి, జైనాబీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

'జగనన్న గోరుముద్ద'పై నిర్లక్ష్యం వీడండి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఉప విద్యాధికారిణి పద్మప్రియ

శెట్టూరు: 'జగనన్న గోరుముద్ద'పై నిర్లక్ష్యం వీడాలని జిల్లా ఉప విద్యాధికారిణి పద్మ ప్రియ ఆదేశించారు. ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజనం నిర్వాహకుల మధ్య తలెత్తిన వివాదంతో లక్ష్మంపల్లి ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు పస్తులుండి సొమ్మసిల్లిన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన ఆమె శుక్రవారం లక్ష్మంపల్లి ఉన్నత పాఠశాలలో పర్యటించారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరును పరిశీలించారు. ఎండీఎం రికార్డులు తనిఖీ చేశారు. మధ్యాహ్నం 12 గంటలైనా కొందరు ఉపాధ్యాయులు ముఖహాజరు, రికార్డుల్లో సంతకం చేయకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. పాఠశాలలో తలెత్తిన సమస్యపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ నిర్వాహకులతో ఆమె మాట్లాడి వాస్తవాలను తెలుసుకున్నారు. పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న జగనన్న గోరుముద్ద కార్యక్రమంపై ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యత, మెనూ పరిశీలించారు. పాఠశాలలో ఆడపిల్లలకు మరుగుదొడ్లు లేకపోవడం, పాఠశాల పరిసరాలు శుభ్రంలేకపోవడంతో ప్రధానోపాధ్యాయుడు సిరాజుద్దీన్‌పై మండిపడ్డారు. అనంతరం పాఠశాలలో చేపట్టిన 'నాడు నేడు' పనులను పరిశీలించారు.

ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేలా పనిచేయాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ కరణం పుష్పావతి

విడపనకల్లు: ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా అధికారులు పనిచేయాలని ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు, జేసీఎస్ కన్వీనర్ భరత్‌రెడ్డి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యలయంలోని సభాభవనంలో ఎంపీపీ ఆధ్వర్యంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తూ ఆదర్శ పాలన సాగిస్తున్నాన్నారు. ఈ నెల 18న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని.. మండలంలో విజయవంతం చేయాలన్నారు. మండల వ్యాప్తంగా 1,800 జగనన్న ఇళ్లు వివిధ నిర్మాణ దశలో ఉన్నాయని, స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో వాటిని పూర్తిచేసేలా లబ్ధిదారుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. కార్య క్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, హౌసింగ్ డీఈ హనుమప్ప, ఏఈ అనిల్‌కుమార్, కోప్షన్ సభ్యుడు లతీఫ్, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ పంపిణీ పక్కాగా జరగాలి

కూడేరు: నులిపురుగుల నివారణ కోసం ఇచ్చే ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ పక్కాగా జరగాలని ఎంపీడీఓ ఎంకే బాషా సూచించారు. ఈ నెల 10న జరిగే ఆల్‌బెండ్‌జోల్ మాత్రల పంపిణీపై శుక్రవారం ఆయన తన చాంబర్‌లో అంగన్‌వాడీ, విద్యా, వైద్యాధికారులతో సమీక్షించారు. మండల వ్యాప్తంగా 1–19 ఏళ్లలోపు పిల్లలు ఎంత మంది ఉన్నది పక్కాగా గుర్తించి నివేదకను సిద్ధం చేయాలన్నారు. ఆల్‌బెండజోల్ పంపిణీలో సిబ్బంది అలసత్వం వహించకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎంఈఓ చంద్రశేఖర్, సీహెచ్‌ఓలు మోహన్‌బాబు, వరలక్ష్మి, సూపర్‌వైజర్లు రవీంద్ర, వెంకటలక్ష్మమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ పాల్గొన్నారు.

గుండె వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

వజ్రకరూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఆదివారం నిర్వహించనున్న గుండె వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే కార్యాలయంలో ఉచిత గుండె వైద్యశిబిరానికి సంబందించిన ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం వజ్రకరూరులోని ప్రాథమిక పాఠశాలలో కిమ్స్ సవీరా ఆస్పత్రి సహకారం, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు శింగనమల ఉస్మాన్ ఆధ్వర్యంలో గుండె వైద్యశిబిరం నిర్వహిస్తారన్నారు. సచివాలయ కన్వీనర్ రఘుపతి, నాయకులు ఈసాసాబ్, నాగరాజు, మునీంద్ర పాల్గొన్నారు.

శభాష్.. వలంటీర్!



కూడేరు: అనంతపురంలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ హేమలత



రాయదుర్గంటౌన్: అనంతపురంలో మల్లికార్జునకు పింఛన్ అందజేస్తున్న వలంటీరు సరస్వతి



విడపనకల్లు: బెంగళూర్‌కు వెళ్లి నాగేంద్రకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ చిరంజీవి



కళ్యాణదుర్గం రూరల్: తిరుపతిలోని స్విమ్స్‌లో వృద్ధుడికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ అనిల్, సర్పంచ్ హనుమంతప్ప

రాయదుర్గంటౌన్/కూడేరు/విడపనకల్లు/కళ్యాణదుర్గం రూరల్: పింఛన్ల పంపిణీ విషయంలో కొందరు వలంటీర్ల సేవాభావం ప్రశంసలు అందుకుంటోంది. దూర ప్రాంతాలకు వెళ్లి మరీ పింఛన్ అందించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. పింఛన్‌దారులు అనారోగ్యంతో బెంగళూరు, తిరుపతి, అనంతపురం తదితర ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నా.. వలంటీర్లు అక్కడకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేసి శెభాష్ అనిపించుకుంటున్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో అందుబాటులో వైద్యం

బొమ్మనహాళ్: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో గ్రామీణ ప్రజలకు ముంగిట్లో వైద్యం అందుతోందని, శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారిణీ గీతాభార్గవి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కర్యాక్రమం నిర్వహించారు. ఆమె రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగమణి, ఆరోగ్య కార్యకర్త గోవర్ధన, జైనాభి, రుక్మిణి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

'అవినీతి అధికారులపై చర్యలు తీసుకోండి'

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్లో అవినీతికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట శుక్రవారం ప్రజా సంఘాల నాయకులు ఆర్‌కే రాజు, తిప్పేస్వామినాయక్, గురుమూర్తి, చెలిమప్ప, తిప్పేస్వామి, వన్నూరప్ప తదితరులు నిరసన చేపట్టారు. కొందరు ఉద్యోగులు అక్రమాలకు పాల్పడి అసైన్డ్ భూములను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడుతున్నారని, దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌చార్జ్ ఆర్డీఓ శంకరయ్యకు వినతి పత్రం అందజేశారు.

నర్సరీలకు అనుమతులు తప్పనిసరి

కళ్యాణదుర్గం: నర్సరీల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి అని ఉద్యాన వన శాఖ అధికారి కృష్ణ తేజ సూచించారు. పట్టణ సమీపంలోని నర్సరీలను శుక్రవారం ఆయన పరిశీలించారు. నర్సరీ నిర్వాహకులు రిజిస్ట్రేషన్, లైసెన్స్, బిల్ బుక్కులు, రిజిస్టర్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రైతులకు నాసిరకం పైరును విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిరప పైర్లను అధిక ధరలకు విక్రయించకూడదన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి



మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూధన్‌రావు

కళ్యాణదుర్గం రూరల్: సంక్షేమ పథకాలను అర్హులకు అందించాలని సాంఘిక సంక్షేమ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్‌రావు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం డివిజన్ పరిధిలోని వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హత ఉండి, టెక్నికల్ సమస్య వల్ల అందకపోతే అధికారులకు తెలపాలన్నారు. ముఖ్యంగా పెన్షన్ల విషయంలో ఎలాంటి అవినీతికి అవకాశం ఉండకుండా ఉండాలన్నారు. సచివాలయానికి వచ్చే ప్రజలతో మంచిగా ప్రవర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాలమాన్, డీఎల్‌డీఓ శంకర్, ఏఎస్‌డబ్ల్యూ దామోదర్‌రెడ్డి, డివిజన్ పరిధిలోని మండలాల అధికారులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

కళ్యాణదుర్గం: వసతి గృహాల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా వార్డెన్లు పనిచేయాలని సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మధుసూదన్‌రావు సూచించారు. కళ్యాణదుర్గంలోని కళాశాలల బాలుర, బాలికల వసతి గృహాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వసతి గృహాల విద్యార్థులు చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలని సూచించారు. స్టడీ అవర్స్ పెంచి, వంద శాతం ఫలితాలకు కృషి చేయాలని వార్డెన్లకు సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వసతి గృహాల్లో భోజన నాణ్యతలో రాజీ పడకూడదన్నారు. అనంతరం కళాశాల బాలికల వసతి గృహ విద్యార్థినులతో కలిసి జేడీ సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూ దామోదర్‌రెడ్డి, వార్డెన్లు నాగరాజు, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకే సేవలు సద్వినియోగం చేసుకోండి



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

విడపనకల్లు: ఆర్బీకే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. మండలంలోని వేల్పుమడుగు గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతు భరోసా కేంద్రం ద్వారా అమలవుతున్న ప్రభుత్వ సేవలపై ఆరా తీశారు. సబ్సిడీ వేరుశనగ, సీసీఆర్‌సీ కార్డు, పీఎం కిసాన్, రైతు భరోసా తదితర అంశాలకు సబంధించి రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. గతంలో ప్రతి పనికీ మండల కేంద్రానికి వెవెళ్లేవారమని, జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత గ్రామాల్లోనే ఏర్పాటు చేసి సమస్యలు లేకుండా చేశారని రైతులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆమె రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉరవకొండ ఏడీఏ పద్మజ , మండల వయసాయాధికారి పెన్నయ్య, వీపీఏ కుళ్లాయిస్వామి, రైతులు పాల్గొన్నారు.

రైతుల నుంచి ఫిర్యాదులు రాకూడదు

కూడేరు: రైతుల నుంచి ఫిర్యాదులు రాకుండా అందుబాటులో ఉండి సేవలందించాలని జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ సిబ్బంది సూచించారు. శుక్రవారం మండలంలోని గొటుకూరులోని రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడ నిర్వహిస్తున్న గ్రామ వ్యవసాయ సలహా కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఓ విజయ కుమార్, వీఏఏ పుల్లప్ప, సలహా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని మల్లాపురం గ్రామానికి చెందిన మారెక్క(45)అనే మతిస్థిమితం లేని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. మారెక్క శుక్రవారం తెల్లరుజామున ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సేంద్రియ వ్యవసాయం లాభదాయకం

కుందుర్పి: సేంద్రియ పద్ధతిలో పంటలు సాగుచేసి అధిక దిగుబడులు సాధించాలని ఆర్డీటీ టెక్నికల్ డైరెక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, ఎస్టీయూ రామాంజనేయులు సూచించారు. శుక్రవారం కెంచంపల్లి, కలిగొలిమి, కొలిమిపాళ్యం తదితర గ్రామాల్లో ఆర్డీటీ అందిస్తున్న సబ్సిడీ బిందు సేద్యం పరికరాలు, పండ్లతోటల పెంపకం, సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధికి తోడ్పాటునివ్వండి

కుందుర్పి: అటవీ ప్రాంతాల అభివృద్ధికి పరిసర గ్రామాల ప్రజలు తోడ్పాటు నివ్వాలని జంబుగుంపల అటవీ బీట్ అధికారి పరమేశ్వరప్ప సూచించారు. శుక్రవారం ఆయన సిబ్బందితో కలసి జంబుగుంపల అటవీ ప్రాంతంలోని నడుంబీడు, బోరప్పకనుమ, గొవమ్మ పెంట తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అడవుల్లో పచ్చని చెట్లను నరికినా, వన్యప్రాణులను వేటాడినా కఠిన చర్యలు తీసుకుంటమని ఆయన హెచ్చరించారు. నడుంబీడు, కొత్తపల్లి కనుమ తదితర ప్రాంతాల్లో మొక్కల పెంపకం చేపట్టి అడవుల్లో నీటి కుంటలు, చెక్‌డ్యాంలు ఏర్పాటు చేయాలని ఎంపీపీ కమలమ్మ, సర్పంచ్ గంగాధర తదితరులు అటవీశాఖ అధికారులను కోరారు.